పారదర్శకంగా సర్వే చేపట్టండి : కలెక్టర్

ధర్మారం, న్యూస్‌టుడే: వివిధ గ్రామాల్లో ప్రభుత్వ భూముల సర్వేను పారదర్శకంగా చేపట్టాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. అధికారులతో కలిసి బుధవారం ధర్మారంలో కలెక్టర్ పర్యటించి తహసీల్దారు, మండల పరిషత్తు, సెర్ప్ ఏపీఎం కార్యాలయాలను సందర్శించారు. ఖిలావనపర్తిలో సర్వేను శనివారంలోగా పూర్తిచేయాలని, బొమ్మారెడ్డిపల్లి శివారులో సర్వే మొదలెట్టాలని ఆదేశించారు. కోర్టు కేసులు, ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి అధికారులు ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని సూచించారు. తహసీల్ కార్యాలయంలో మౌలిక వసతుల నిర్మాణ పనులను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు ఉండేలా చర్యలు తీసుకోవాలని.. వసతులు లేని చోట ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించాలని సూచించారు. సెర్ప్ కార్యాలయ అధికారులు, సిబ్బందికి సూచనలు చేశారు. ధర్మారంలో పీహెచ్‌సీ నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని కలెక్టర్ పరిశీలించారు.



ధర్మారం తహసీల్ కార్యాలయంలో వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

పోషకాహార లోపాలు తగ్గించాలి

పెద్దపల్లి కలెక్టరేట్: పిల్లల్లో పోషకాహార లోపాలు తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. సమీకృత పాలనా ప్రాంగణంలో బుధవారం అంగన్‌వాడీ కేంద్రాల సమీక్షలో ఆయన మాట్లాడుతూ నాణ్యమైన పోషకాహారం అందించాలని స్పష్టం చేశారు. శనివారంలోపు సిబ్బంది పదోన్నతి జాబితా నివేదించాలని సూచించారు. ప్రీస్కూళ్లను సూపర్‌వైజర్లు నిరంతరం తనిఖీ చేయాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు అవసరమైన బోధన నైపుణ్య మెలకువలు నేర్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి రవూఫ్‌ఖాన్, సిబ్బంది పాల్గొన్నారు.

మీపై గురుతర బాధ్యత!

- విధుల్లో చేరిన కొత్త ఉపాధ్యాయులు
- సర్కారు బడుల బలోపేతానికి కృషి చేయాలి

న్యూస్‌టుడే- కరీంనగర్ విద్యావిభాగం



డీఎస్సీ-2024 ద్వారా ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఎంపికైన వారు బుధవారం విధుల్లో చేరారు.. తొలిరోజు విద్యార్థులకు పాఠాలు బోధించి తమ ఇన్నేళ్ల కష్టానికి ఫలితం దక్కిందని ఆనందపడ్డారు.. ఉద్యోగం కోసం అహర్నిశలు కష్టపడి అనుకున్న లక్ష్యాన్ని సాధించిన మీరు.. భావి పౌరులుగా ఎదిగే విద్యార్థులకు మార్గదర్శకులు కావాలి.. సర్కారు బడుల బలోపేతానికి.. పేద, మధ్య తరగతి పిల్లలకు నాణ్యమైన విద్య అందడానికి మీ వంతు కృషి చేయాలి. నిత్యం పాలనా విధులతో బిజీ బిజీగా ఉండే నలుగురు జిల్లాల కలెక్టర్లు విద్యా రంగంపై ప్రత్యేక దృష్టి పెడుతున్నారు. వినూత్న కార్యక్రమాలతో ప్రభుత్వ బడుల బలోపేతానికి కృషి చేస్తున్నారు. మీరు ఈ క్రమంలో భాగస్వాములు కావాలి. ప్రభుత్వ పాఠశాలలు మరింత మెరుగవడానికి మీ వంతు పాత్ర పోషించాలి.

ఉమ్మడి జిల్లాలో..
- మొత్తం ప్రభుత్వ పాఠశాలలు..: 2,465
- విద్యార్థులు : 1,65,691
- పని చేస్తున్న ఉపాధ్యాయులు : 10,078
- కొత్తగా నియమితులైనవారు : 692

బడి బాట పట్టేలా..

చదువుకోవాల్సిన వయసులో పలు కారణాలతో బాలలు బడులకు దూరంగా ఉంటున్నారు. గత జనవరిలో విద్యాశాఖ చేపట్టిన సర్వేలో ఉమ్మడి జిల్లాలో బడి బయట బాలలు 1,185 మంది ఉన్నట్లు గుర్తించారు. చదువు విలువ తెలిసిన మీరు మీ బడుల పరిధిలో చదువుకు దూరమైన బాలలు బడిలో చేరేలా చూడాలి. తల్లిదండ్రులకు చదువు విలువపై అవగాహన కల్పించాలి. వలస కుటుంబాల్లోని బాలలు పనుల వైపు మళ్లకుండా అక్షర జ్ఞానం కల్పిస్తే వారి గుండెల్లో మీరు చిరస్థాయిగా నిలిచిపోతారు.

బోధనలో నూతన ఒరవడి

ప్రపంచం వేగంగా మారిపోతోంది.. కొత్త ఆలోచనలతో ముందుకు సాగే విద్యార్థులే ఈ పోటీలో దూసుకెళ్తున్నారు.. మీ పరిధి విద్యార్థులకు బట్టీ చదువులకు పరిమితం కాకుండా కొత్త ఆలోచనలు చేసేలా ప్రోత్సహించాలి. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు పలు సామర్థ్య పరీక్షల్లో వెనుకంజలో నిలుస్తున్నారు. బడుల్లో కృత్యాధార బోధనను అమలు చేస్తున్నా పూర్తి స్థాయిలో ఫలితం ఇవ్వడం లేదు. కొత్తగా చేరిన మీరు సిలబస్ పూర్తి చేశాం.. పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేశామా అన్న దానికే పరిమితం కావొద్దు. మీరు చెప్పింది విద్యార్థులు ఎంత వరకు అర్థం చేసుకున్నారు. వారు ఏం నేర్చుకున్నారనేదానిపై దృష్టి పెడితేనే మీ బోధనకు సార్థకత. చెప్పడం కంటే చూసి నేర్చుకుంటే విద్యార్థులు మరిచిపోరు. కృత్యాధార బోధనకు పెద్దపీట వేయాలి. ప్రభుత్వంపై ఆధారపడకుండా సొంత పరిజ్ఞానంతో బోధన పరికరాలు తయారు చేసుకుని నూతన ఒరవడితో బోధన సాగించాలి.



గంగాధర మండలం కురిక్యాల ప్రాథమిక పాఠశాలలో తొలిరోజు బాలలకు బోధిస్తున్న కొత్త ఉపాధ్యాయురాలు

మంచి అలవాట్లు నేర్పించండి..

స్మార్ట్‌ఫోన్‌లకు అన్ని వయసుల వారు బానిసలవుతున్నారు. మీ పరిధి విద్యార్థులు చరవాణి బానిసలు కాకుండా వారికి మంచి అలవాట్లు నేర్పించండి. పాఠాలు చదవడంతోపాటు [illegible] చేయకుండా స్ఫూర్తిదాయక వ్యక్తుల జీవిత చరిత్రలు, మంచి సాహిత్యం చదివేలా ప్రోత్సహించండి. చదువు తరవాత ఆటపాటలు, మంచి పుస్తక పఠనం అలవాటు చేస్తే వారు జీవితంలో ఉన్నతంగా ఎదిగేందుకు దోహదపడినవారవుతారు.

భరోసానివ్వండి..

మీ బడిలో చదివే విద్యార్థులకు మీరున్నారనే భరోసానివ్వండి. ఉపాధ్యాయ వృత్తికి కళంకం తెస్తున్న కొందరు గురువులు.. తోటి విద్యార్థులు బాలికలను వేధిస్తున్న ఘటనలు అక్కడక్కడా చోటుచేసుకుంటున్నాయి.. ఎవరినైనా ఇలా వేధిస్తే వెంటనే మీకు చెప్పేలా ధైర్యం చెబితే వారు స్వేచ్ఛగా తమ అభిప్రాయాలు పంచుకుంటారు. అప్పుడు ఇలాంటి వేధింపులను అరికట్టవచ్చు. విద్యార్థులకు చదువు ఒక్కటే కాదు క్రమశిక్షణ, దేశభక్తి, ఆత్మగౌరవం నేర్పించడంపైనా దృష్టి పెట్టాలి. వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యకరమైన అలవాట్లు నేర్పించాలి. అప్పుడే మీరు ఉపాధ్యాయ వృత్తికి పరిపూర్ణత తెచ్చినవారు అవుతారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

పెద్దపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో రైస్ మిల్లులకు కేటాయించిన బియ్యం లక్ష్యాలపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని అదనపు పాలనాధికారి శ్యాంప్రసాద్‌లాల్ తెలిపారు. సమీకృత పాలనా ప్రాంగణంలో బుధవారం అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ.. గతేడాది వానాకాలం, యాసంగి సీజన్లకు కేటాయించిన ధాన్యానికి బియ్యం అప్పగించాలని సూచించారు. బియ్యం మరబట్టేందుకు ఉన్న సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ శ్రీకాంత్, జిల్లా పౌరసరఫరాల అధికారి రాజేందర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు పాలనాధికారి శ్యాంప్రసాద్‌లాల్

జిల్లాలో కొత్తగా ఎనిమిది పోలింగ్ కేంద్రాలు

పెద్దపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో కొత్తగా ఎనిమిది పోలింగ్ కేంద్రాల ఏర్పాటు ప్రతిపాదనలు రూపొందించామని అదనపు పాలనాధికారి శ్యాంప్రసాద్‌లాల్ తెలిపారు. సమీకృత పాలనా ప్రాంగణంలో రాజకీయ పార్టీలతో జరిగిన సమావేశంలో ఆయన ఈ మేరకు మాట్లాడారు. పెద్దపల్లి నియోజకవర్గంలో 1, రామగుండంలో 3, మంథనిలో 4 పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు నివేదికలు సిద్ధం చేశామన్నారు. రామగుండం, మంథనిలో మూడు చొప్పున పోలింగ్ కేంద్రాలు ఉన్న ప్రాంతాల్లో మార్పులు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో రాజకీయ పార్టీల నాయకులు సంపత్‌రావు, శశిభూషణ్ కాచే, రవీందర్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి గణేశ్

చట్టాలపై అవగాహన

సుల్తానాబాద్, న్యూస్‌టుడే: సుల్తానాబాద్ మండలం కనుకులలో బుధవారం సుల్తానాబాద్ మున్సిఫ్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి దుర్గం గణేశ్.. న్యాయ విజ్ఞాన సదస్సు ఏర్పాటు చేసి గ్రామస్థులకు పలు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుటుంబ, ఆస్తి తగాదాలు, చిన్నచిన్న తప్పిదాల కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలని సూచించారు. కార్మికులకు ప్రభుత్వం కల్పిస్తున్న బీమాను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శి శ్రీరాములు, రమేశ్, ఏజీపీ లక్ష్మీరాజం, న్యాయవాదులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

సమస్యలు తొలగాలి.. సిరులు కురవాలి

న్యూస్‌టుడే, పెద్దపల్లి

ఆశాజనకంగా మొదలవుతున్న పత్తి కొనుగోళ్లు దిగుబడులు ఊపందుకునే సమయానికి ప్రతికూలంగా మారుతున్నాయి. రెండేళ్లుగా ఇదే తరహాలో సీజన్ మధ్యలో ధరలు పడిపోతుండడంతో సీసీఐ (భారత పత్తి సంస్థ) కొనుగోళ్లు అనివార్యమవుతున్నాయి. సీసీఐ కొనుగోలు కేంద్రాలు మిల్లుల వద్దే ఏర్పాటు చేయడం కూడా రైతుల విక్రయాలకు అవరోధంగానే మారుతున్నాయి. అక్కడ జరిగే విక్రయాలు మిల్లర్లకే అనుకూలంగా మారుతున్నాయి. సీసీఐ తిరస్కరించిన పత్తిని కొనుగోలు చేయడానికి మిల్లు యాజమాన్యమే ప్రత్యామ్నాయం. సీసీఐ కొనుగోలు కేంద్రాల్లోని తాత్కాలిక ఉద్యోగులు సైతం మిల్లర్లకు అనుకూలంగా మారిపోవడంతో సమస్య రెట్టింపవుతోంది. తూకంలో జరుగుతున్న మోసాలు, నగదు పేరుతో కోతలు, అశాస్త్రీయమైన ఈనామ్ కొనుగోళ్ల వెరసి.. పత్తి రైతుకు నిరాశ మిగులుతోంది.

కొందరికే మద్దతు..

సీసీఐ కొనుగోలు కేంద్రాలు మిల్లర్లకు మద్దతు కల్పిస్తున్నాయి. సీసీఐ కొనుగోలు చేసిన పత్తిని మార్కెట్ యార్డు నుంచి రైతులే సీసీఐ లీజుకు తీసుకున్న జిన్నింగ్‌మిల్లుకు రవాణా వ్యయాన్ని భరించాలనే నిబంధన విధించారు. దీంతో సీసీఐ మద్దతు ధర కోసం తప్పనిసరిగా మిల్లులకే పత్తిని తీసుకువెళ్లాల్సి వస్తోంది. అక్కడికి వెళ్లిన రైతులకు మద్దతు లభిస్తుందనే గ్యారంటీ లేదు. తేమ లేదా ఇతర అంశాలు సీసీఐ ప్రమాణాలను అందుకోవడం లేదనే సాకుతో సీసీఐ తిరస్కరించిన పత్తిని తిరిగి ఇంటికి లేదా మార్కెట్‌కు తీసుకెళ్తే రవాణా వ్యయం పెరుగుతుందని భావించే సగటు రైతు అదే మిల్లులో ఇచ్చిన రేటుకు విక్రయించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది కానీ.. అనునాయకులకు మాత్రం ఎక్కడి వారికైనా గరిష్ఠ ధర చెల్లించే పరిస్థితి ఉంది. గతేడాది కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన రైతులు అక్కడి సీసీఐ కేంద్రాలను వదిలేసి పెద్దపల్లిలోని ఒక జిన్నింగ్ మిల్లులో పత్తిని విక్రయించారు. దీనిపై ఆర్భాటంగా విచారణ నిర్వహించిన అధికారులు చివరికి ఏమీ తేల్చకుండా చేతులు దులుపుకోవడంతో మద్దతు ధర అమలుపై పలు అనుమానాలు వ్యక్తం అయ్యాయి.

పెద్దపల్లి మార్కెట్‌లో పత్తి కొనుగోళ్లు (క్వింటాళ్లలో..)

సంవత్సరం	సీసీఐ	ప్రైవేటు	మద్దతు ధర
2019-20	220321	54234	5550(రూ.లలో)
2020-21	153334	35244	5825
2021-22	0	64301	6025
2022-23	1033	71149	6380
2023-24	64109	93135	7020

పేరుకేనా ఈ-నామ్?

ఆయా మార్కెట్‌ల ధరలను తెలిపేలా ఈనామ్ మార్కెట్‌లో ప్రత్యేక తెరపై ప్రదర్శించాలి కానీ.. ఇలాంటి పరిస్థితి జిల్లాలో ఎక్కడా కనిపించదు. ఇక్కడి పత్తినైనా ఇతర మార్కెట్‌లలోని ట్రేడర్లు కొనుగోలు చేయడానికి నాణ్యత ప్రమాణాలను కొలిచే ఉపకరణాలేవి అందుబాటులో లేవు. కేవలం తేమ కొలిచే యంత్రం మినహా ఇతర పరికరాలేవీ లేవు. దీంతో ఇక్కడి పత్తి నాణ్యతను లెక్కించి, ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేయడం ద్వారా వేలం నిర్వహించే పరిస్థితి లేదు. కేవలం ఇతర మార్కెట్‌లలోని కొనుగోలుదారులు లేదా వారి ప్రతినిధులు భౌతికంగా పత్తిని చూసి కొనుగోలు చేసేందుకే అవకాశముంది. దీంతో స్థానిక లేదా ఇతర మార్కెట్‌ల కొనుగోలుదారులు నాణ్యతను ప్రత్యక్షంగా వీక్షించి, ధరలను నియంత్రించేందుకు అవకాశాలున్నాయి. చెల్లింపుల్లో కూడా ప్రైవేటు కొనుగోలుదారులు నగదు కోత విధించడం, సీసీఐ సైతం పలు సాంకేతిక కారణాలతో నెలల తరబడి రైతులు చెల్లింపుల కోసం నిరీక్షించాల్సి వస్తోంది. గతేడాది ఒక ఎన్ఆర్ఐ అకౌంట్‌లో పత్తి డబ్బులు జమ చేయడానికి ఆరు నెలల సమయం పట్టింది. పంటరుణాల డబ్బులు బ్యాంకర్లు కట్ చేసుకుంటారనే భయంతో బ్యాంక్ ఖాతాలను ఆధార్‌తో అనుసంధానం చేయని రైతులు కూడా నెలల తరబడి చెల్లింపులకు నిరీక్షించాల్సి వచ్చింది.

ఇలా చేస్తే ప్రయోజనం

- మార్కెట్‌లో 2016 వరకు కొనుగోలు చేసిన పత్తిని సీసీఐ సొంత ఖర్చులతో జిన్నింగ్ మిల్లులకు పత్తిని తరలించేది కానీ.. అనంతరం నిబంధనలు మారడంతో రవాణ భారం రైతుపై పడుతోంది.
- ఈ పరిస్థితిని మార్చేందుకు మార్కెట్‌లో కొనుగోలు చేసిన పత్తిని మిల్లులకు తరలించే వ్యయాన్ని మార్కెటింగ్ శాఖ లేదా రాష్ట్ర ప్రభుత్వం భరిస్తే రైతులకు మార్కెట్‌లో గిట్టుబాటవుతుంది.
- పత్తి నాణ్యత విషయానికి వస్తే కేవలం తేమ కొలిచే యంత్రాలు మినహా శాస్త్రీయంగా పత్తిలోని పింజ పొడవు, అవుట్ టర్న్ కొలిచే పరికరాలు లేకపోవడంతో ధర నిర్ణయంలోని శాస్త్రీయత రైతులకు తెలియడం లేదు.
- తేమ తక్కువ ఉంటేనే ధర వస్తుందని, కాకుండా అన్ని ప్రమాణాలు కొలిచే పరికరాలను మార్కెట్‌లో ఏర్పాటు చేసి, వాటి సాంకేతిక నిపుణులను నియమించినట్లయితే కొంత రైతులకు ప్రయోజనం కలుగుతుంది.

సహజ ప్రసవాలు పెంచే దిశగా సన్నాహాలు


ఖని ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాట్లు

న్యూస్‌టుడే, గోదావరిఖని పట్టణం

సహజ ప్రసవాలతోనే తల్లి, బిడ్డ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండటంతోపాటు ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఎదురుకావని ప్రభుత్వం విస్తృతంగా ప్రచారం చేస్తున్నా.. ఆశించిన మేర ఫలితం రావడంలేదు. పురిటినొప్పులు భరించలేక శస్త్ర చికిత్సతో ప్రసవం చేయాల్సిందిగా ఆసుపత్రి వర్గాలపై ఒత్తిడి తెస్తున్నారు. లేదంటే ప్రభుత్వ ఆసుపత్రిలో పట్టించుకోవడం లేదంటూ ఆరోపిస్తూ ప్రైవేటును ఆశ్రయిస్తున్నారు. వెరసి ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల రేటు తగ్గడంతోపాటు ప్రజలపై ప్రైవేటు భారం పడుతుంది.

యోగా కేంద్రాలు ఏర్పాటు చేసినా..

గర్భం దాల్చినప్పటి నుంచి సహజ ప్రసవాలపై అవగాహన పెంచడంతోపాటు యోగా చేయించాలంటూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో యోగా కేంద్రాలను ఏర్పాటుచేసినా.. నిర్వహణ నామమాత్రంగానే ఉంది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో జరిగే ప్రసవాల్లో 80 శాతం వరకు సహజ ప్రసవాలే ఉండాలని ప్రభుత్వం ఎప్పటికప్పుడు ఒత్తిడి తెస్తున్నా.. 30 శాతానికి మించడం లేదు.



ఖని ప్రభుత్వ ఆసుపత్రిలో గత ఏడు నెలల్లో జరిగిన ప్రసవాల వివరాలు

నెల	సహజ	శస్త్రచికిత్స
మార్చి	47	93
ఏప్రిల్	37	91
మే	34	114
జూన్	34	95
జులై	60	106
ఆగస్టు	50	127
సెప్టెంబరు	50	119

అందుబాటులోకి అత్యాధునిక వ్యవస్థ

సహజ ప్రసవాల నిర్వహణలో పేరొందిన హైదరాబాదులోని ఓ ప్రముఖ ఆసుపత్రిలో నొప్పి రహిత సహజ ప్రసవానికి సుమారు రూ.5 లక్షల వరకు ఖర్చు కానుంది. దీంతో కొంతమంది గర్భం దాల్చినప్పటి నుంచే అక్కడికి వెళ్లి ప్రసవాలు చేయించుకుంటున్నారు. అలాంటి అత్యాధునిక నొప్పి రహిత సహజ ప్రసవాల వ్యవస్థ త్వరలోనే ఖనిలోని ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులోకి రానుంది. ఈ మేరకు ప్రత్యేకంగా లేబర్ రూంలో ఆధునికీకరణ పనులు కొనసాగుతున్నాయి.

- గర్భిణికి ఎపిడ్యురల్ ఎనస్తీషియా ఇవ్వడంతో నొప్పి తెలియకుండానే సహజ ప్రసవం జరగనుంది. ఎనస్తీషియా ప్రభావం 10 నుంచి 15 నిమిషాల వరకు ఉండనుండగా.. ఈ లోగా ప్రసవం జరిగేలా ఆసుపత్రి వైద్యులు చర్యలు తీసుకుంటారు.



ఖని ప్రభుత్వ ఆసుపత్రిలోని శస్త్ర చికిత్స ప్రసవాల వార్డు

కేవలం 26 శాతమే

గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రిలో గతేడాది ప్రసవాలను పరిశీలిస్తే కేవలం 26.3 శాతం మాత్రమే సహజ ప్రసవాలు జరిగాయి. పెద్దపల్లి, మంథని, మంచిర్యాలలోని ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరగడంతో ఖని ఆసుపత్రికి వచ్చే గర్భిణిల సంఖ్య తగ్గిపోయింది. అందులోనూ సహజ ప్రసవాల సంఖ్య మరీ తక్కువగా ఉంటున్నాయి.

సహజ ప్రసవాలపైనే ప్రత్యేక దృష్టి

సహజ ప్రసవాలను పెంచేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాం. కేవలం హైదరాబాదులోని ప్రముఖ ఆసుపత్రుల్లోనే అందుబాటులోనున్న నొప్పి రహిత ప్రసవాల ప్రక్రియను గోదావరిఖనిలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. తద్వారా ఈ ప్రాంతంలో సహజ ప్రసవాల సంఖ్య పెరగనుంది.

- డాక్టర్ హిమబిందుసింగ్, ప్రిన్సిపల్, ప్రభుత్వ వైద్య కళాశాల, గోదావరిఖని

మద్దతు ధరలో తేమ శాతం కీలకం

ఓదెల, న్యూస్‌టుడే: వానాకాలం వరి ధాన్యం సేకరణ, కొనుగోలు కేంద్రాల నిర్వహణపై ఓదెల మండల కేంద్రంలో బుధవారం ఓదెల, కాల్వశ్రీరాంపూర్ మండలాల ఐకేపీ సిబ్బందికి డీపీఎం తిరుపతి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ ధాన్యాన్ని కల్లాల వద్దే ఆరబెట్టి.. 17 శాతం తేమ చూసుకొని.. శుభ్రం చేసి కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలన్నారు. ఏ గ్రేడ్ రకానికి రూ.2,320, కామన్ గ్రేడ్‌కు రూ.2,300ల మద్దతు ధర ఉందన్నారు. కార్యక్రమంలో ఏపీఎంలు లతామంగేశ్వరి, కనుకయ్య, సీసీలు శ్రీనివాస్, మల్లయ్య, కొమురయ్య, విజయ, శారద, హరికృష్ణ, నిర్మల, తిరుపతిదేవి, కనకతార, భవాని చంద్రకళ, మండల సమాఖ్య అధ్యక్షురాళ్లు మౌనిక, లలిత తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీపీఎం తిరుపతి

తక్కువ ధరకు ఎరువులు

ఆర్ఎఫ్‌సీఎల్ పాత్రపై గవర్నర్‌కు వివరణ

ఫర్టిలైజర్ సిటీ, న్యూస్‌టుడే: గవర్నర్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల ఉన్నతాధికారులతో బుధవారం హైదరాబాద్ రాజ్‌భవన్‌లో నిర్వహించిన ఇంటరాక్టివ్ సమావేశంలో రామగుండం ఎరువుల కర్మాగారం(ఆర్ఎఫ్‌సీఎల్) చీఫ్ జనరల్ మేనేజర్ ఉదయ్ రాజహంస పాల్గొన్నారు. దేశంలో వ్యవసాయ ఉత్పత్తులను పెంచేలా రైతాంగానికి అవసరమైన యూరియాను తక్కువ ధరకు, సకాలంలో అందిస్తున్నట్లుగా ఆయన గవర్నర్‌కు వివరించారు. భారత పౌరులందరికి ఆహార భద్రత కల్పించే ప్రయత్నంలో ఆర్ఎఫ్‌సీఎల్ కీలకపాత్రను పోషిస్తుందన్నారు. పొరుగు రాష్ట్రాలకు సైతం యూరియాను సకాలంలో అందిస్తూ రైతాంగానికి ఆర్ఎఫ్‌సీఎల్ అండగా నిలుస్తుందని వివరించారు.



ప్రసంగిస్తున్న ఆర్ఎఫ్‌సీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ ఉదయ్ రాజహంస

సర్కిల్ ఇన్‌స్పెక్టర్ల బదిలీలు

గోదావరిఖని: మల్టీజోన్-1 పరిధిలో పనిచేస్తున్న సీఐలను బదిలీ చేస్తూ ఐజీపీ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. రామగుండం పోలీసు కమిషనరేట్ పరిధి ఐటీ విభాగంలో విధులు నిర్వహిస్తున్న ప్రమోద్‌రావును మంచిర్యాల ఠాణాకు, అక్కడి అధికారి ఆర్. బన్సీలాల్‌ను హైదరాబాద్ మల్టీజోన్-1 ఐజీపీ కార్యాలయానికి బదిలీ చేశారు. రాజన్న సిరిసిల్ల సీసీఎస్ పరిధి డి. వేణుచందర్‌ను శ్రీరాంపూర్ సర్కిల్ ఠాణాకు, అక్కడి అధికారి మోహన్‌ను హైదరాబాద్ మల్టీజోన్-1 కార్యాలయంలో రిపోర్టు చేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు.



టవర్ చుట్టూ అల్లుకుపోయిన తీగలు



మొక్కలతో నిండిపోయిన కవరింగ్ షెడ్డు



రైతులు సేదతీరే బెంచీల పక్కన పరిస్థితి

మార్కెట్‌లో స్వచ్ఛత మాటేది?

జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ నిర్వాహణలో అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. బుధవారం నుంచి పత్తి కొనుగోళ్లు.. త్వరలోనే ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం కానున్నాయి. అయినా మార్కెట్ పరిసరాల్లో స్వచ్ఛత కరవైంది. పత్తి.. ధాన్యం యార్డుల నిర్వాహణ అధ్వాన్నంగా ఉన్నాయి. కవరింగ్ షెడ్లపై.. చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. టీఎంసీ మార్కెట్‌లోని విద్యుత్తు టవర్ గడ్డి తీగలతో నిండిపోయింది. రైతులు సేదతీరేందుకు ఏర్పాటు చేసిన బెంచీల చుట్టూ పిచ్చిమొక్కలు ఉన్నాయి. ఈ విషయంపై కార్యదర్శి పృథ్వీరాజ్‌ను వివరణ కోరగా మార్కెట్‌ను శుభ్రం చేయించేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. **- న్యూస్‌టుడే, పెద్దపల్లి**

పోలీసు అమరవీరుల సంస్మరణ పోటీలు

గోదావరిఖని, న్యూస్‌టుడే: ఈనెల 21న నిర్వహించే పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పలు పోటీలు నిర్వహిస్తున్నట్లు రామగుండం పోలీసు కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు. కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల పరిధిలోని ప్రతి పోలీసు స్టేషన్‌లో పోలీసుల త్యాగాలను స్మరిస్తూ 21 నుంచి 31 వరకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. అలాగే ఓపెన్‌హౌస్ కార్యక్రమాలు, పోలీసు విధులు, వినియోగించే ఆయుధాలు, సాంకేతిక వినియోగం తదితర కార్యక్రమాలు చేపడుతారన్నారు. ఇంటర్ విద్యార్థులకు చరవాణి వినియోగంపై, డిగ్రీ విద్యార్థులకు 'డ్రగ్ రహిత రాష్ట్రం కోసం నా పాత్ర' అనే అంశాలపై ఆన్‌లైన్‌లో వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గలవారు పోలీసుశాఖ వెబ్‌సైట్‌కు పంపించాలని కోరారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 4 PM)
గోదావరిఖని : 80085 73573
పెద్దపల్లి : 80085 73542
మంథని : 99122 68471

న్యూస్‌టుడే, సుల్తానాబాద్

? సుల్తానాబాద్ మండలవ్యాప్తంగా కోతుల బెడద ఎక్కువగా ఉంది. అధికారులు చొరవ చూపి కోతుల బెడదను నివారించాలి. - రమేశ్, గ్రామస్థుడు

✓ సమస్యను అధికారులకు విన్నవించాం. వారి ఆదేశాల మేరకు త్వరలో తగిన చర్యలు తీసుకుంటాం. - శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి

బిల్లులు చెల్లించాలని నిరసన



ముత్తారం, న్యూస్‌టుడే: ముత్తారం మండలంలోని ఖమ్మంపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట మహిళలు బుధవారం బైఠాయించి నిరసన తెలిపారు. గత సంవత్సరం దసరా, దీపావళి పండగలకు, దశల్లి ఉత్సవాలకు కూలీ పనులు చేశామని బిల్లులను సంబంధించిన వివరాలను కార్యదర్శి గ్రామ పంచాయతీ తీర్మాన మినిట్ బుక్‌లో నమోదు చేశారని తెలిపారు. ఇప్పటికీ ఆ బిల్లులను చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

చికిత్సల్లో అనస్థీషియా కీలకం

గోదావరిఖని పట్టణం: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రపంచ అనస్థీషియా దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ దయాల్‌సింగ్, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ హిమబిందుసింగ్‌లతోపాటు పలువురు వైద్యులు పాల్గొన్నారు. కేకు కట్ చేసి మిఠాయిలు పంచారు. రోగికి చికిత్స అందించడంలో అనస్థీషియా ప్రాధాన్యాన్ని వివరించారు.

డిగ్రీ ప్రవేశాల గడువు పొడిగింపు

మార్కండేయకాలనీ: కాకతీయ విశ్వవిద్యాలయ దూరవిద్య అధ్యయన కేంద్రంలో డిగ్రీ ప్రవేశాలకు ఈనెల 30 వరకు పొడిగించినట్లు ఖని డిగ్రీ కళాశాల కౌన్సిలర్ రాము తెలిపారు. అధ్యయన కేంద్రం డైరెక్టర్ రామచంద్రం ఆదేశాల మేరకు డిగ్రీ, పీజీ, డిప్లొమా కోర్సులలో గ్రంథాలయ, మాస్టర్ ఆఫ్ జర్నలిజం, హెచ్‌ఆర్‌ఎం, సైబర్ లా డిప్లొమా ఇన్ కంప్యూటర్, యోగా, పీజీలో సైన్స్ కోర్సుల్లో ఆసక్తి గల విద్యార్థులు ప్రవేశం పొందవచ్చన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం

కాల్వశ్రీరాంపూర్: గంగారం గ్రామానికి చెందిన సీపీఐ నాయకుడు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు కొట్టిక రవీందర్ గౌడ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. రవీందర్‌గౌడ్‌తో కలిసి 1981లో కాల్వశ్రీరాంపూర్ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన స్నేహితులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.18 వేల ఆర్థిక సాయం అందజేశారు. సుముఖం రవీందర్ రెడ్డి, గౌడు రాజకొమురయ్య, మేడి రాజయ్య, ఆషాడపు రాజయ్య, గోతం శంకర్, జూపాక రాంచంద్రం తదితరులు పాల్గొన్నారు.

20న పద్మశాలీ దసరా మేళా

పెద్దపల్లి: హైదరాబాద్‌లోని ఎల్బీనగర్‌లో ఈ నెల 20న జరిగే పద్మశాలీ దసరా మేళా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కార్యక్రమ ఛైర్మన్ వలస నీలయ్య కోరారు. పెద్దపల్లిలో బుధవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో దసరా మేళా ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. పద్మశాలీ సంఘం నాయకులు ఆడెపు సుధాకర్, గుబవెల్లి పురుషోత్తం, దీవీఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

విలువిద్య పోటీల్లో బంగారు పతకం

ముత్తారం, న్యూస్‌టుడే: ముత్తారం మండలం సీతంపేట గ్రామానికి చెందిన లింగం శ్రీహన్స్ కార్తికేయ విలువిద్య విభాగంలో ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి పోటీల్లో బంగారు పతకం సాధించాడు. హైదరాబాద్ గచ్చిబౌలి మైదానంలో ఈ నెల 15, 16 తేదీల్లో జరిగిన స్పోర్ట్స్ ఫర్ ఆల్ ఛాంపియన్‌షిప్‌లో భాగంగా అత్యుత్తమ ప్రతిభ కనబరిచాడు. 12 రౌండ్లు జరిగిన ఈ పోటీల్లో అత్యధిక పాయింట్లు సాధించిన లింగం శ్రీహన్స్ కార్తికేయ బంగారు పతకం అందుకోగా పలువురు అభినందించారు.



పతకంతో శ్రీహన్స్ కార్తికేయ

నిబంధనల అతిక్రమణ.. ఏడాది జైలు

సుల్తానాబాద్, న్యూస్‌టుడే: బైండోవర్ నిబంధనలు అతిక్రమించిన వారికి తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి ఏడాది జైలు శిక్ష విధించారు. ఎక్సైజ్ సీఐ గురునాథ్ రాథోడ్ కథనం ప్రకారం.. సుల్తానాబాద్ పట్టణం మార్కండేయకాలనీకి చెందిన స్వాతి, శాంతినగర్‌కు చెందిన స్వరూపలు గతంలో గుడుంబా అమ్ముతుండగా ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకొని తహసీల్దార్ ఎదుట హాజరుపర్చారు. బైండోవర్ నిబంధనలు అతిక్రమించి మళ్లీ గుడుంబా అమ్ముతుండగా బుధవారం వారిని అదుపులోకి తీసుకొని తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి ఎదుట హాజరుపర్చారు. వారికి ఒక ఏడాది జైలుశిక్షను తహసీల్దార్ విధించగా వారిని ఎక్సైజ్ పోలీసులు కరీంనగర్ జైలుకు తరలించారు.

నేర వార్తలు

భర్త హత్య కేసులో భార్య అరెస్టు

గోదావరిఖని: స్థానిక ఐబీకాలనీకి చెందిన బానోతు హరిసింగ్ హత్య కేసులో అతని భార్యను ఖని ఒకటో పట్టణ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. గత నెల 16న తన ఇంట్లో మృతిచెందిన హరిసింగ్ మృతిపై పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. దీనిపై విచారణ చేసిన పోలీసులు.. డీఎన్‌ఏ నివేదిక ఆధారంగా హత్య కేసుగా గుర్తించారు. ఇందులో మృతుని భార్య బానోతు దశి, మరో యువకుడు రొంటాల నరేశ్‌ల ప్రమేయం ఉన్నట్లు విచారణలో తేలడంతో ఇద్దరిని ఒకటో పట్టణ పోలీసులు అరెస్టు చేశారు.

వ్యక్తిపై కత్తితో దాడి

గోదావరిఖని: స్థానిక సంజయ్‌నగర్‌కు చెందిన జోగు పోశం(55)పై బుధవారం అదే కాలనీకి చెందిన యువకుడు కుటుంబ కలహాల కారణంగా కత్తితో హత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీంతో పోశం చేతి వేళ్లకు గాయాలయ్యాయి. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో యువకుడు అక్కడి నుంచి పారిపోయాడు.

దరఖాస్తుల ఆహ్వానం

జూలపల్లి: మండలంలోని పెద్దాపూర్ గ్రామ శివారులో ఉన్న ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో గంటల ప్రతిపాదికన అర్థశాస్త్రం, హిందీ సబ్జెక్టులు బోధించుటకు ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఎండీ షాదుల్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గలవారు గురువారం తమ ధ్రువపత్రాలతో డెమోకు హాజరు కావాలని సూచించారు.

గుండె వైద్య శిబిరం

ఓదెల: ఓదెల మల్లిఖార్జున స్వామి దేవాలయ సిబ్బందికి కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో బుధవారం ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించారు. 150 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కాంగ్రెస్ పార్టీ మండలశాఖ అధ్యక్షుడు మూల ప్రేమ్‌సాగర్‌రెడ్డి, పీఏసీఎస్ ఛైర్మన్ ఆళ్ల సుమన్‌రెడ్డి, ఆలయ ఈవో సుధాకర్, సీనియర్ సహాయకులు కుమారస్వామి, ఆలయ ప్రధాన అర్చకులు వీరభద్రయ్య, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

గోడపత్రిక ఆవిష్కరణ

పాలకుర్తి(అంతర్గాం): టీయూసీఐలో ఐఎఫ్‌టీయూ విలీన సభను జయప్రదం చేయాలని కోరుతూ అంతర్గాం మండలం ఎక్లాస్‌పూర్‌లో గోడపత్రికలను బుధవారం ఆవిష్కరించారు. ఐఎఫ్‌టీయూ నాయకులు వెంకన్న సీపీఐ ఎంఎల్ మాస్ ప్రజాపంథా డివిజన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

ముత్తారం: ముత్తారం మండలం కాసర్లగడ్డలో ఇటీవల పరుపాటి రాజక్క అనారోగ్యంతో మృతి చెందారు. బాధిత కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ బుధవారం పరామర్శించారు.

గేటు పడితే అరగంట ఆగాల్సిందే!



రామగుండం పట్టణ సమీపంలో ఉన్న కుందనపల్లి రైలు గేట్లతో రాకపోకలు సాగించేవారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దిల్లీకి ఇదే ప్రధాన మార్గం కావడంతో నిత్యం రైళ్ల రాకపోకలతో హడావుడిగా ఉంటుంది. దీనికితోడు కుందనపల్లి వద్దనున్న ఇంధన నిల్వ కేంద్రాలకు రవాణా చేసే డీజిల్, పెట్రోలు ట్యాంకర్లకు ప్రత్యేక రైలు సదుపాయం ఇదే మార్గంలో ఉంది. గేటు పడితే కనీసం అరగంటపాటు వేచిచూడాల్సి వస్తుంది. రైల్వే అండర్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, గోదావరిఖని

కలప అక్రమ తరలింపు



జూలపల్లి మండలంలోని అబ్బాపూర్ నుంచి వేపచెట్లను నరికి ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. పెద్దపల్లి అటవీ రేంజ్ అధికారి నాగయ్యను సంప్రదించగా జూలపల్లి మండల పరిసర ప్రాతల నుంచి కలప తరలింపునకు ఎవరూ ఎలాంటి అనుమతులు పొందలేదని తెలిపారు. అక్రమ రవాణాను అరికట్టేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, జూలపల్లి

విధుల్లో చేరిన ఉపాధ్యాయులు



మంథనిలో నూతన ఉపాధ్యాయులకు సన్మానం

మంథని, మంథని గ్రామీణం, న్యూస్‌టుడే: మంథని మండలంలో బుధవారం కొత్తగా 12 మంది ఉపాధ్యాయులు విధుల్లో చేరారు. ఇటీవల డీఎస్సీలో మంథని మండలానికి 10 మంది స్కూల్ అసిస్టెంట్లు, ఇద్దరు ఎస్జీటీలను కేటాయించారు. దీంతో మండలంలోని అడవి సోమన్‌పల్లిలో ఇద్దరు, నాగేపల్లిలో ఒక్కరు, ఆరెందలో ఇద్దరు, మంథని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఒక్కరు, బాలుర ఉన్నత పాఠశాలలో ఒక్కరు, అక్కెపల్లిలో ఒక్కరు, పోతారంలో ఇద్దరు, మంథని ఉర్దూ మీడియం పాఠశాలలో ఒక్కరు విధుల్లో చేరారు.



ఆరెందలో ప్రధానోపాధ్యాయిని శ్రీలతతో నూతన ఉపాధ్యాయులు

నిబద్ధత అవసరం

మంథని: మంథని మండలంలో ఉపాధ్యాయులుగా విధుల్లో చేరిన వారికి పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘం బాధ్యులు ఉపాధ్యాయ వృత్తిపై అవగాహన కల్పించారు. మండల విద్యాధికారి కార్యాలయంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కర్రు సురేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ, నిబద్ధతతో విధులు నిర్వహించాలన్నారు. బలహీన వర్గాల విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే గురుతర బాధ్యతను మరవద్దన్నారు. మండలశాఖ అధ్యక్షుడు దొంతుల కుమార్, ప్రధాన కార్యదర్శి ఎర్రం రమేశ్, కార్యదర్శి శ్రీకాంత్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు సురేశ్‌లు పాల్గొన్నారు.

పీఆర్టీయూ నాయకుల సన్మానం

కాల్వశ్రీరాంపూర్: కాల్వశ్రీరాంపూర్ మండలంలో నూతన ఉపాధ్యాయులుగా ఎంపికైన ముగ్గురు ఉపాధ్యాయులను మండల కేంద్రంలో బుధవారం పీఆర్టీయూ నాయకులు శాలువాలతో సత్కరించారు. డీఎస్సీ 2024లో ఎంపికైన జిన్నా సతీష్‌కుమార్ (అంకంపల్లి), ఎస్.రాజమౌళి (వెన్నంపల్లి), కె.ప్రశాంత్‌రెడ్డి (కాల్వశ్రీరాంపూర్) ప్రభుత్వ పాఠశాలల్లో ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పీఆర్టీయూ మండలశాఖ అధ్యక్షుడు ముంజాల హరికృష్ణ గౌడ్, నాయకులు కూరెల్ల మల్లారెడ్డి, పులి శ్రీనివాస్‌రెడ్డి, వెంకటస్వామి, రవికుమార్, శ్రీకాంత్, కూచయ్య, మోత్కూరి నారాయణ తదితరులు పాల్గొన్నారు.



కాల్వశ్రీరాంపూర్‌లో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పీఆర్టీయూ నాయకులు

విద్యుత్తు ఉద్యోగుల బాధ్యతల స్వీకరణ

కమాన్‌పూర్(సెంటినరీకాలనీ), న్యూస్‌టుడే: మండలంలో బుధవారం పలువురు ఎన్‌పీడీసీఎల్ విద్యుత్తు ఉద్యోగులు విధుల్లో చేరారు. ఉద్యోగుల బదిలీల ప్రక్రియలో భాగంగా వీరందరూ బదిలీపై వచ్చారు. బేగంపేట సెక్షన్ పరిధిలో సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ (రామగిరి), లైన్ ఇన్‌స్పెక్టర్లు నాగరాజు (ముస్త్యాల), నవీన్‌కుమార్ (బేగంపేట), లైన్‌మెన్లు శివకుమార్ (రామగిరి), రాజేందర్ (ముస్త్యాల), శ్రీనివాస్ (కల్వచర్ల), రమేశ్ (బేగంపేట), సహాయ లైన్‌మెన్లు నాగరాజు (సుందిల్ల), రాజేశ్ (ముస్త్యాల)లు రత్నాపూర్ ఉపకేంద్రం సబ్ ఇంజినీరు కమ్మరికుంట సతీశ్‌ను కలిసి విధుల్లో చేరారు.

కమాన్‌పూర్‌లో..

కమాన్‌పూర్: కమాన్‌పూర్ సెక్షన్ పరిధిలో సహాయ ఇంజినీరు అశోక, సబ్ ఇంజినీరు శ్రవణ్‌కుమార్, సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్ అశోక్, లైన్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణరావు, లైన్‌మెన్ ఓదెలు(టౌన్), నాగరాజు (జూలపల్లి), ఎల్‌ఎంవోలు రఘుపతిరెడ్డి, శ్రీధర్‌బాబు, అడిషనల్ లైన్‌మెన్ శ్రీనివాస్(టౌన్), జూనియర్ లైన్‌మెన్ వెంకటస్వామి (పెంచికల్‌పేట) విధుల్లో చేరారు.

మంథని: మంథని విద్యుత్తు శాఖ ఏఈ మల్లయ్య కాజీపేటకు బదిలీ అయ్యారు. మంచిర్యాలలో పని చేస్తున్న ఏఈ రాజేశ్ ఇక్కడి బాధ్యతలను బుధవారం స్వీకరించారు.

ధర్మారం: ధర్మారం విద్యుత్తుశాఖ సబ్‌డివిజన్ కార్యాలయ పరిధిలోని నలుగురు సబ్ ఇంజనీర్లు బుధవారం విధుల్లో చేరారు. ధర్మారం సెక్షన్‌లో ప్రణయ్, ఖిలావనపర్తి లో దిలీప్, జూలపల్లిలో దినేశ్, సబ్‌డివిజన్ కార్యాలయంలో సందీప్‌లు బాధ్యతలు స్వీకరించారు.

సన్మానం

కాల్వశ్రీరాంపూర్: కాల్వశ్రీరాంపూర్ మండల కేంద్రంలో విద్యుత్తు విభాగంలో లైన్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించి బదిలీపై ధర్మారం వెళ్లిన దోమ్మటి రాజయ్యను విద్యుత్తు అధికారులు బుధవారం శాలువాలతో సత్కరించారు. ఏడీఈ మధూకర్, ఏఈ శ్రీనివాస్, రాజమల్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముత్తారం: ఉద్యోగికి బదిలీ సహజమని ముత్తారం ఏఈ హనుమాన్ దాస్ అన్నారు. మండలంలోని లక్కారం సబ్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న లైన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, లైన్‌మెన్ సయ్యద్ అఫ్జల్ పాషా బదిలీ అయ్యారు. వారి స్థానంలో కొత్తవారు బాధ్యతలను స్వీకరించారు. ఈ మేరకు బుధవారం వారిని సన్మానించి, వారి సేవలను అభినందించారు. సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్ మల్లయ్య, వెంకటేశ్, తిరుపతి, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థినికి చేయూత



ఆర్థిక సాయం అందజేస్తున్న సత్యనారాయణ, భాగ్యలక్ష్మి దంపతులు

సుల్తానాబాద్, న్యూస్‌టుడే: సుల్తానాబాద్ పురపాలక సంఘం పరిధిలోని పూసాలకు చెందిన వెంగళ హర్షిత తల్లిదండ్రులు గతంలో మృతిచెందారు. హర్షితకు ఇటీవల మిర్యాలగూడ జేఎన్టీయూసీలో ఇంజినీరింగ్‌లో సీటు వచ్చింది. తన ఆర్థికంగా ఇబ్బందిని తెలుసుకున్న సుల్తానాబాద్ పట్టణం గాంధీనగర్‌కు చెందిన విశ్రాంత ఉద్యోగులు అల్లం సత్యనారాయణ, భాగ్యలక్ష్మి దంపతులు బుధవారం హర్షితకు రూ.10 వేలు అందించారు. రూ.5 వేల చొప్పున మరో మూడేళ్లు అందిస్తామని హామీ ఇచ్చారు.

తెరవే కథల ముచ్చట్లు నేడు

పెద్దపల్లి: తెలంగాణ రచయిత వేదిక (తెరవే) ఆధ్వర్యంలో గురువారం జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో కథల ముచ్చట్లు నిర్వహిస్తున్నట్లు తెరవే బాధ్యులు జీగురు రవీందర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఔత్సాహిక రచయితలు సింగిల్ పేజీలో కథలతో గురువారం సాయంత్రం కలెక్టరేట్ ప్రాంగణంలో జరిగే సమావేశానికి హాజరుకావాలని కోరారు.

ఖమ్మంపల్లిలో ఎంపీవో విచారణ

ముత్తారం, న్యూస్‌టుడే: ముత్తారం మండలం ఖమ్మంపల్లి గ్రామంలో బుధవారం ఎంపీవో కిరణ్ విచారణ చేపట్టారు. ఖమ్మంపల్లి బిల్ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న మనోజ్‌కుమార్ అక్రమాలకు పాల్పడుతూ ప్రజల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారని అదే గ్రామానికి చెందిన వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంథని ఆర్డీవో ఆదేశాలతో ఈ విచారణ నిర్వహించారు. సేకరించిన వివరాల నివేదికను ఉన్నత అధికారులకు పంపినట్లు ఎంపీవో తెలిపారు.

పోలీసుల నిర్బంధ తనిఖీలు

పాలకుర్తి(అంతర్గాం): అంతర్గాం మండలం కుందనపల్లి గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామమైన రాజాపురంలో బుధవారం పోలీసులు నిర్బంధ తనిఖీలు చేపట్టారు. రామగుండం సీఐ ప్రవీణ్‌కుమార్ హాజరై మాట్లాడారు. రోడ్డు భద్రతా నియమాలు, సీసీ కెమెరాల బిగింపు, మాదక ద్రవ్యాల నిర్మూలనపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అంతర్గాం ఎస్సై వెంకటస్వామి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్తం

■ విద్యార్థులకు అవగాహన

పెద్దపల్లి: పెద్దపల్లి ట్రినిటీ ఇంజినీరింగ్ కళాశాలలో ఎంబీఏ మొదటి సంవత్సరం విద్యార్థులకు కోర్సుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ గణేశ్‌మణి, డైరెక్టర్ అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

■ గ్రూపు సభ్యులకు..

కమాన్‌పూర్: మండలంలోని శ్రీసాయి వీవో సమావేశంలో చైల్డ్ హెల్ప్ లైన్ 1098 గురించి గ్రూపు సభ్యులకు హెల్ప్‌లైన్ సభ్యులు బుధవారం అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు, బాల కార్మికులు, బడి బయట పిల్లలు, తప్పిపోయిన పిల్లలు, పోక్సో చట్టం, అనాథ పిల్లలపై అసభ్య ప్రవర్తనపై 1098కి కాల్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు.

■ ఆయిల్‌పాం సాగుపై..

పాలకుర్తి: మండలంలోని ఈసాలతక్కలపల్లిలో బుధవారం మండల వ్యవసాయ అధికారులు ఆయిల్‌పాం సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అధికారి ప్రమోద్ కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

■ అభినందన

ధర్మారం: రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ధర్మారంలోని సాయి మణికంఠ పాఠశాల విద్యార్థిని పి.దీపిక ప్రతిభ చాటింది. నారాయణపేట జిల్లా కోస్గీలో నిర్వహించిన ఎస్జీఎఫ్ రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్టు రెండో స్థానంలో నిలివగా.. దీపికను వ్యాయామ ఉపాధ్యాయులు సాయికుమార్, అశ్వినిలను కరస్పాండెంట్ జైన సురేశ్ కుమార్, ఎండీ రమాదేవి అభినందించారు.

■ సంఘాలు-ఎన్నికలు

పాలకుర్తి: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షులుగా కన్నాల గ్రామానికి చెందిన ఖాదర్‌పాషా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాస్ బుధవారం నియామక పత్రం జారీచేశారు.

పెద్దపల్లి: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మండల శాఖ అధ్యక్షుడిగా అందుగుపల్లి గ్రామానికి చెందిన దామ సదయ్యను నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు.

ధర్మారం: నర్సింహులపల్లిలో శ్రీకృష్ణదేవరాయ మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడిగా ఆకుల రాజయ్య, ఉపాధ్యక్షుడిగా అడువాల చంద్రయ్య, ప్రధాన కార్యదర్శిగా నర్సయ్య, కోశాధికారిగా కనకయ్య, ప్రచార కార్యదర్శిగా స్వామి, గౌరవ అధ్యక్షుడిగా మల్లయ్య, సభ్యులను ఎన్నుకున్నారు.

■ ప్రత్యేక పూజలు

ముత్తారం: ముత్తారం మండలం అడవిశ్రీరాంపూర్ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ సీతారామ చంద్రస్వామి, అయ్యప్పస్వామి ఆలయ ధర్వాజ ప్రతిష్ఠాపన పూజా కార్యక్రమాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. పురోహితుల వేద మంత్రోచ్ఛరణ నడుమ ఆలయ కమిటీ సభ్యులు ఈ పూజలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

■ నిరసన ర్యాలీ

మంథని: సికింద్రాబాద్ పరిధిలో ముత్యాలమ్మ ఆలయంపై దాడికి నిరసనగా మంథనిలో బుధవారం రాత్రి హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో స్థానికులు ర్యాలీ నిర్వహించారు. గాంధీ చౌక్ నుంచి చాకలి ఐలమ్మ కూడలి వరకు నిరసన ప్రదర్శన చేశారు. కొత్త శ్రీనివాస్, సత్యప్రకాశ్, రాపర్తి సంతోశ్, లక్ష్మీనారాయణ, అశోక్, రమేశ్, సతీశ్, సంతోశ్‌లు పాల్గొన్నారు.

■ ప్రతి బూత్‌లో సభ్యత్వ నమోదు

పెద్దపల్లి కలెక్టరేట్: స్థానిక సంస్థల ఎన్నికల్లోపు సభ్యత్వ నమోదు ముమ్మరం చేయాలని భాజపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్ కుమార్ తెలిపారు. జిల్లా కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి బూత్‌కు 200 సభ్యత్వ నమోదు లక్ష్యంగా పని చేస్తే ఫలితం రానుందని తెలిపారు. రాష్ట్రంలో ఆలయాలపై దాడులు అవమానకరమని చెప్పారు. కార్యక్రమంలో అసెంబ్లీ సభ్యత్వ ప్రముఖ్ సంపత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సమైక్యతకు 'అలయ్ బలయ్' నిదర్శనం



ఏకత చాటుతున్న వివిధ వర్గాల నాయకులు

గోదావరిఖని, న్యూస్‌టుడే: సమైక్యతకు అలయ్ బలయ్ నిదర్శనమని మేయర్ అనిల్‌కుమార్ అన్నారు. గోదావరిఖనిలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో బుధవారం నిర్వహించిన అలయ్ బలయ్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమరసత వేదిక ప్రతినిధి వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వివిధ పార్టీలు, సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా పాలనాధికారి కోయ శ్రీహర్ష

పీజీ కోర్సుల అనుమతికి కార్యాచరణ రూపొందించండి

గోదావరిఖని పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో పీజీ కోర్సుల అనుమతికి పటిష్ఠమైన కార్యాచరణతో ముందుకు సాగాలని జిల్లా పాలనాధికారి కోయ శ్రీహర్ష సూచించారు. బుధవారం ప్రభుత్వ వైద్య కళాశాలలో సంయుక్తంగా నిర్వహించిన కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతీయ మెడికల్ కౌన్సిల్ నుంచి అనుమతులు పొందేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. అందుకుగానూ అవసరమైన బోధన బోధనేతర సిబ్బంది, సదుపాయాలు, మౌలిక వసతులపై వివిధ విభాగాల అధికారులతో చర్చించి సూచనలు చేశారు. పీజీ కోర్సుల అనుమతికి వైద్య విధాన పరిషత్తు, వైద్య ఆరోగ్య శాఖ సంపూర్ణ సహకారాన్ని అందించాలని ఆయా విభాగాల ఉన్నతాధికారులను కోరారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ హిమబిందుసింగ్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ నరేందర్, జిల్లా ఆసుపత్రుల నిర్వహణ పర్యవేక్షకులు శ్రీధర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ప్రమోద్‌కుమార్, ఖని ఆసుపత్రి సూపరింటెండెంట్ దయాల్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

గడువులోగా పూర్తి చేయాలి

పెద్దపల్లి కలెక్టరేట్: గ్రామీణ ప్రాంతాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. కలెక్టరేట్‌లో బుధవారం ఆయా శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షలో పలు సూచనలు చేశారు. జిల్లాలో 18 ఉప ఆరోగ్య కేంద్రాల పనులను ప్రారంభించి జాప్యం లేకుండా పర్యవేక్షించాలన్నారు. అదనపు పాలనాధికారి అరుణశ్రీ, సీపీవో రవీందర్, పీఆర్ ఈఈ గిరీశ్‌బాబు పాల్గొన్నారు.

మద్దతు ధరతో పత్తి కొనుగోళ్లు

పెద్దపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే: రైతులు పండించిన నాణ్యమైన పత్తిని మద్దతు ధర కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉండాలని అదనపు పాలనాధికారి శ్యాంప్రసాద్‌లాల్ తెలిపారు. సమీకృత ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ 8 శాతం తేమ ఉన్నత పత్తికి రూ.7,521 మద్దతు ధర చెల్లించాలన్నారు. కొనుగోళ్లలో దళారుల ప్రమేయం లేకుండా పర్యవేక్షించాలన్నారు. రైతులు నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి ఆదిరెడ్డి పాల్గొన్నారు.

పరిహారంపై అభ్యంతరాలుంటే ఫిర్యాదు చేయండి

పెద్దపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే: సింగరేణి బొగ్గు గనుల విస్తీర్ణంలో ఆస్తులు కోల్పోతున్న బాధితులు పరిహారంపై సమస్యలు ఉంటే ఫిర్యాదు చేసుకోవచ్చని అదనపు పాలనాధికారి శ్యాంప్రసాద్‌లాల్ తెలిపారు. సమీకృత పాలనా ప్రాంగణంలో బుధవారం రామగిరి మండలం బుధవారంపేట భూనిర్వాసితులతో నిర్వహించిన సమావేశంలో ఆయన ఈ మేరకు మాట్లాడారు. గ్రామంలో 88.20 ఎకరాలను సేకరిస్తున్నామని వెల్లడించారు. జాబితాలో పేర్లు రాని వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ, సింగరేణి అధికారులు పాల్గొన్నారు.

సింగరేణి

మైనింగ్ సిబ్బందికి కౌన్సెలింగ్

గోదావరిఖని, న్యూస్‌టుడే: ఉపరితల గనుల్లో పనిచేసేందుకు ఆసక్తి ఉన్న మైనింగ్ సిబ్బందికి ఆర్జీ-1 ప్రాంతంలోని సాంకేతిక శిక్షణ కేంద్రంలో బుధవారం వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించారు. 54 మంది దరఖాస్తు చేసుకోగా.. అందులో వెబ్‌కౌన్సెలింగ్‌కు 51 మంది హాజరయ్యారు. దరఖాస్తుదారల ప్రాధాన్యత ఆధారంగా అవకాశం కల్పించేందుకు చర్యలు తీసుకున్నారు. కౌన్సెలింగ్ కమిటీ సభ్యులు ఆంజనేయప్రసాద్, ఆంజనేయులు, రవీందర్‌రెడ్డి, అశోక్‌రావు తదితరులున్నారు.

క్వార్టర్స్ కేటాయింపునకు...

కమాన్‌పూర్ (సెంటినరీకాలనీ), న్యూస్‌టుడే: రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ సుధాకరరావు ఆదేశాల మేరకు ఏరియాలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు సెంటినరీకాలనీలోని క్వార్టర్ల కేటాయింపు కోసం బుధవారం సెక్యూరిటీ కార్యాలయ ఆవరణలో కౌన్సెలింగ్ నిర్వహించారు. మొత్తం 185 ఖాళీ క్వార్టర్లు ఉన్నాయి. నూతనంగా, మార్పు కోసం 69 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్నారని ఎస్‌వోటూ జీఎం రఘుపతి తెలిపారు. ఇందులో 27 మంది హాజరై 25 మంది తమకు కావాల్సిన క్వార్టర్లను ఎంపిక చేసుకున్నారని తెలిపారు. వారికి త్వరలో అలాట్మెంట్ లెటర్లు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పర్సనల్ విభాగాధిపతి సుదర్శనం, గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు రామచంద్రారెడ్డి, కోట రవీందర్ రెడ్డి డీపీఎం గుర్రం శ్రీహరి, క్వార్టర్ల విభాగం సిబ్బంది రమ్య, సదయ్య పాల్గొన్నారు.

ఓసీపీ-2 గని సందర్శన

కమాన్‌పూర్ (సెంటినరీకాలనీ), న్యూస్‌టుడే: ఆర్జీ-3 ఏరియాలోని ఓసీపీ-2 ఉపరితల గనిని బుధవారం డైరెక్టర్ ప్లానింగ్ ప్రాజెక్టు, పర్సనల్ అడ్మినిస్ట్రేషన్ వెల్ఫేర్ వెంకటేశ్వరరెడ్డి సందర్శించారు. ఉపరితల గని వ్యూ పాయింట్ నుంచి క్వారీలో నడుస్తున్న పనులను పరిశీలించారు. నిర్దేశించిన లక్ష్యాలను సాధించుటకు తీసుకుంటున్న భద్రతా చర్యలు, ప్రణాళికల వివరాలను ఆర్జీ-3 ఏరియా జీఎం సుధాకరరావు డైరెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ.. మట్టి వెలికితీత కాంట్రాక్టు కంపెనీ రోజువారీ లక్ష్యాలను సాధించాలని, నీరు నిల్వకుండా చర్యలు చేపట్టాలన్నారు. బొగ్గు ఉత్పత్తికి ఎటువంటి ఆటంకం కలగకుండా చూసుకోవాలని, భద్రతతో కూడిన ఉత్పత్తి, ఉత్పాదకత, రవాణా సాధించడానికి ఉద్యోగులు కృషి చేయాలన్నారు. ఇన్‌ఛార్జి అధికారి రాజశేఖర్, ఎస్టేట్స్ అధికారి ఐలయ్య, డిప్యూటీ మేనేజర్ కోల శ్రీనివాస్, సర్వే అధికారులు పాల్గొన్నారు.



ఓసీపీ-2 వ్యూ పాయింట్ నుంచి పరిశీలిస్తున్న వెంకటేశ్వరరెడ్డి

జోనల్ స్థాయి రెస్క్యూ పోటీల ప్రారంభం



పోటీల్లో పాల్గొన్న రెస్క్యూ సభ్యులు

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి 53వ జోనల్‌స్థాయి రెస్క్యూ పోటీలు బుధవారం ఆర్జీ-2 డివిజన్‌లోని మైన్స్ ఆవరణలో లాంఛనంగా ప్రారంభమయ్యాయి. ముందుగా సంస్థ సంచాలకులు వెంకటేశ్వర్‌రెడ్డి, మరో అధికారి సావర్కర్‌లు రెస్క్యూ పతాకాన్ని ఎగరవేశారు. 10 మంది భారత బొగ్గు గనుల భద్రత విభాగం అధికారులు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు.


ఇంకుడు గుంతల పనులు ప్రారంభం

కమాన్‌పూర్, న్యూస్‌టుడే: ఆర్జీ-3 ఏరియా పరిధి ఓసీపీ-1 రెమీడియేషన్ ప్లాన్‌లో భాగంగా కమాన్‌పూర్ మండలం గుండారం గ్రామానికి నాలుగు ఇంకుడు గుంతలను మంజూరు చేసిన ఏరియా ప్రాజెక్టు అధికారి రాధాకృష్ణ బుధవారం తెలిపారు. భూగర్భజలాలు పెంపులో భాగంగా గ్రామంలో అవసరమైన చోట వీటిని ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. ఒక్కో ఇంకుడుగుంతకు రూ.20 వేల చొప్పున నాలుగింటికి రూ.80 వేలు కేటాయించినట్లు తెలిపారు. వీటి పనులను బుధవారం ప్రారంభించారు.

మత్తుతో బతుకులు చిత్తు!

గంజాయికి బానిసవుతున్న యువత

ఈనాడు, కరీంనగర్



■ కరీంనగర్‌లోని ఓ కాలనీకి చెందిన పదో తరగతి విద్యార్థి స్నేహితులతో కలిసి గంజాయికి అలవాటు పడ్డాడు. చేతి ఖర్చులకు రోజూ రూ.500 వరకు అడిగే పరిస్థితికి చేరాడు. కూలీనాలీ చేస్తూ కష్టపడే తల్లిదండ్రులు అడిగినన్ని డబ్బులు ఇవ్వకుంటే సామగ్రిని ధ్వంసం చేయడంతోపాటు తల్లిదండ్రులపై చేయిచేసుకోవడం మొదలు పెట్టాడు. బంధువులు చొరవ తీసుకుని కరీంనగర్‌లోని ఓ మానసిక వైద్యుడి దగ్గర చికిత్స చేయిస్తున్నారు.

■ జగిత్యాల జిల్లాలో గంజాయికి బానిసైన యువకులు కొందరు ఓ బాలికను అలవాటు చేశారు. మైకంలో ఉన్న ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డారు. బాలిక తల్లిదండ్రులు ఆలస్యంగా గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసిన ఘటన ఏడాది కిందట సంచలనం రేకెత్తించింది.



2023లో..

జిల్లా	కేసులు	పట్టుకున్న గంజాయి (కిలోల్లో)	అరెస్టైన యువకులు
కరీంనగర్	22	27.608	45
పెద్దపల్లి	25	34.380	55
జగిత్యాల	13	91.540	36
సిరిసిల్ల	59	70.793	127

● కోడ్ భాష లేదా అమితంగా తెలిసిన వ్యక్తుల ద్వారానే వీటిని అవసరమున్న వారికి చాకచక్యంగా విక్రయిస్తున్నారు.

● చాక్లెట్ రూపంలో వీటిని రహస్యంగా విక్రయిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో గంజాయి వినియోగం రోజురోజుకు పెరుగుతోంది. ఓ వైపు పోలీసులు పక్కడ్బందీ చర్యలు చేపడుతున్నా వినియోగం మాత్రం ఆగడం లేదు. గంజాయి మత్తులో జోగుతున్న యువత తమ ఆరోగ్యం దెబ్బతీసుకోవడంతోపాటు నేరాలకు పాల్పడుతున్న ఘటనలు పోలీసులు గుర్తిస్తున్నారు. గొడవలకు దిగడం, చోరీలకు పాల్పడటమే కాకుండా వేగంగా ద్విచక్ర వాహనాలు నడుపుతూ రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్న ఘటనలు కూడా ఉంటున్నాయి. కొందరు ఈ ప్రమాదాల్లో ప్రాణాలు కూడా కోల్పోతున్నారు. ఏడాది వ్యవధిలో 200ల కిలోలకుపైగా గంజాయిని వివిధ ప్రాంతాల్లో పోలీసులు పట్టుకున్నారు. 100 మంది వరకు యువకులు, వారి కుటుంబీకులకు ఆయా ఠాణాల పరిధిలో పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించారు. అయినా పూర్తి స్థాయిలో అడ్డుకట్ట పడటం లేదు.

అక్రమ రవాణా, పంపిణీ ఇలా..


గంజాయి మత్తెక్కించే వాసన గుర్తించకుండా దట్టమైన కవర్లలో ప్యాకింగ్ చేస్తున్నారు.

● ప్లాస్టిక్ కవర్లు, అట్టముక్కలలో పెట్టి పైన సుగంధ ద్రవ్యాల వాసన వచ్చే సెంట్ విడిగా చల్లుతున్నారు.

● ఆర్టీసీ బస్సుల్లో ఉండని బావిలి సూట్‌కేసుల్లో బ్యాగ్‌ల మధ్యలో పెట్టి రవాణా చేస్తున్నారు.

● గంజాయిని మరిగిస్తూ నూనె తయారు చేస్తున్నారు. బిస్కట్ల సీసాల్లో ప్యాక్ చేస్తూ జాగ్రత్త పడుతున్నారు.

పలు ప్రాంతాల నుంచి..: ఉమ్మడి జిల్లాకు రాష్ట్రంలోని పలు పట్టణాలతోపాటు పక్క రాష్ట్రాల నుంచి గంజాయి వస్తోంది. పోలీసులకు పట్టుబడిన కేసులను బట్టి వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న గంజాయి ఇలా..



యువతే లక్ష్యంగా : పేద కుటుంబాలకు చెందిన యువతను రవాణాకోసం వినియోగిస్తున్నారు. గంజాయికి బానిసలవుతున్నవారిలోనూ వారే అధికంగా ఉంటున్నారు. అమ్మేవారు.. లేదా తీసుకుంటూ పట్టుబడిన వారిలో 18 ఏళ్ల నుంచి 29 ఏళ్ల వయసున్న వారే ఉంటుండటం గమనార్హం. ఈ ఏడాది పట్టుబడిన వారిలో ఈ వయసు వారే 72 శాతం ఉంటున్నట్లు పోలీసులు చెబుతున్నారు.

● కరోనాకు ముందు 2019లో నాలుగు జిల్లాల పరిధిలో అధికారికంగా పట్టుబడిన గంజాయి ఏడాది కాలంలో 30-40 కిలోలు ఉండేది. ఇప్పుడు ఏటా క్వింటాలు దాటుతుండటం గమనార్హం. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖ జిల్లా మన్యం ప్రాంతం నుంచి ఉమ్మడి కరీంనగర్‌కు సరఫరా చేయడం పెరిగింది.

నాడీ వ్యవస్థపై తీవ్ర ప్రభావం:



గంజాయి వల్ల మనిషిలోని పలు అవయవాలపై, నాడీ వ్యవస్థపైన విపరీతమైన ప్రభావం పడుతుంది. మెదడు మొద్దుబారుతుంది. ఎక్కువ మోతాదులో తీసుకున్నప్పుడు ఏమి చేస్తున్నారో తెలియని స్థితి వస్తుంది. మత్తు వల్ల కళ్లకు విపరీతమైన హాని కలుగుతుంది. ఎర్రబడటంతోపాటు దృష్టిలోపం సమస్య ఏర్పడుతుంది. బీపీ ఎక్కువవుతుంది. ఊపిరితిత్తులపైనా శ్వాసకోశ నాళాలపైనా ఈ ప్రభావం ఎక్కువగా ఉంటుంది.

- డాక్టర్ తిరుపతి, ఫిజిషియన్, కరీంనగర్

కర్ణాటక వసతి గృహాల దుప్పట్లు సిరిసిల్లలో ఉత్పత్తి

మూడు లక్షల మీటర్ల ఆర్డర్లు



గుత్తేదారుకు అప్పగించేందుకు సిద్ధం చేసిన దుప్పట్లు

ఈనాడు, సిరిసిల్ల: వస్త్రోత్పత్తుల ఖిల్లా సిరిసిల్లకు కర్ణాటక రాష్ట్రంలోని వసతి గృహాలకు అవసరమైన దుప్పట్ల ఆర్డర్లు వస్తున్నాయి. అక్కడి ప్రభుత్వం విద్యార్థులకు అందించే దుప్పట్ల ఆర్డర్లు పొందిన గుత్తేదారు ఇక్కడి ఆసాములచే ఉత్పత్తి చేయిస్తున్నారు. సిరిసిల్లలోని 68 ఇంచుల మరమగ్గాలున్న పది మంది ఆసాములు ఉత్పత్తి చేస్తున్నారు. నెలకు 40 వేల మీటర్ల చొప్పున మొత్తం మూడు లక్షల మీటర్ల లక్ష్యం. ఉత్పత్తి పూర్తయిన తర్వాత గార్మెంట్ పరిశ్రమలో మహిళలే కుట్టి గుత్తేదారుకు అప్పగిస్తున్నారు. ఒక్కో ఆసామికి ముడిసరకు అందించి మీటరుకు రూ.5 చొప్పున కూలీ మాత్రం చెల్లిస్తున్నారు. నాలుగు మరమగ్గాలు నడిపే ఆసామి ఒక షిఫ్టులో 200 మీటర్లు ఉత్పత్తి చేస్తారు. సగటున ఒక షిఫ్టునకు రూ.వెయ్యి కూలీ గిట్టుబాటు అవుతుంది. అలాగే గార్మెంట్‌పై కుట్టి ఇచ్చే మహిళలకు ఒక దుప్పటికి రూ.5 చెల్లిస్తున్నారు. ఇలా రోజుకు 50 చొప్పున రూ.250 గిట్టుబాటు అవుతుంది. వీటితో పరిశ్రమలోని ఆయా విభాగాల్లో 200 మంది ఉపాధి పొందుతున్నారు. మొత్తంగా 30 లక్షల మీటర్ల ఆర్డర్లు ఉన్నా ఆసాముల వద్ద పెట్టుబడి లేక తక్కువ మొత్తంలో తీసుకున్నారు. చేనేత, జౌళిశాఖ పెట్టుబడులకు పరిశ్రమ వర్గాలతో సంప్రదింపులు చేస్తున్నారు. ఇవి ఫలిస్తే భారీ మొత్తంలో మరిన్ని ఆర్డర్లతో ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. వీటితోపాటు ఝార్ఖండ్ ప్రభుత్వం పంపిణీ చేసే చీరల ఆర్డర్లు కూడా ఇప్పుడిప్పుడే పరిశ్రమకు వస్తున్నాయి.

రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీల్లో సత్తా



పతకాలు సాధించిన జిల్లా రెజ్లర్లు

కరీంనగర్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లో ఈనెల 15, 16న జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి అండర్-19 కుస్తీ పోటీల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఆటగాళ్లు సత్తా చాటారు. రుక్మాపూర్ సైనిక్ పాఠశాలకు చెందిన పి.వినయ్‌కుమార్, టి.సిద్ధార్థలు రజత పతకాలు, బి.నరసింహ, కె.రాజరథన్, ఎన్.దినేష్‌లు కాంస్య పతకాలు సాధించారు. ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ జూనియర్ కళాశాల నుంచి కె.రాజు రజతం, కె.విజయ్ కాంస్య పతకం, వి.రఘు చరణ్ (అల్ఫోర్స్ జూనియర్ కళాశాల) కాంస్య పతకం, సి.హెచ్ ఆదిత్య మహారాజ్ (ట్రినిటీ) కాంస్య పతకం సాధించినట్లు రెజ్లింగ్ టీం కోచ్ ఎం.వంశీకృష్ణ తెలిపారు. వీరిని తెలంగాణ అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మహ్మద్ కరీం, కళాశాలల క్రీడా సమాఖ్య కరీంనగర్ జిల్లా కార్యదర్శి మధు జాన్సన్‌లు అభినందించారు.

రహదారి ప్రమాదంలో ప్యాక్స్ మాజీ ఛైర్మన్ మృతి

అభివృద్ధి పనుల బిల్లుల కోసం వెళ్లి వస్తుండగా ఘటన



శ్రీనివాస్‌రెడ్డి

సుల్తానాబాద్, న్యూస్‌టుడే: రహదారి ప్రమాదంలో ప్యాక్స్ మాజీ ఛైర్మన్ మృతిచెందిన ఘటన ఎలిగేడు మండలం బురహాన్‌మియాపేటలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్సై శ్రీధర్, స్థానికుల కథనం ప్రకారం.. బురహాన్‌మియాపేటకు చెందిన గోదాల శ్రీనివాస్‌రెడ్డి (56) గతంలో ఎలిగేడు ప్యాక్స్ ఛైర్మన్‌గా. . తన భార్య మంగ గ్రామ సర్పంచిగా పనిచేశారు. ఎలిగేడు, సుల్తానాబాద్ మండలాల్లో చేపట్టిన పలు అభివృద్ధి పనుల బిల్లుల కోసం శ్రీనివాస్‌రెడ్డి తన భార్యతో కలిసి మంగళవారం పెద్దపల్లి పీఆర్ డీఈ కార్యాలయానికి ద్విచక్రవాహనంపై వెళ్లారు. తిరిగి వస్తున్న క్రమంలో పెద్దపల్లి పట్టణంలో కారు ఢీకొంది. ఆయన తలకు బలమైన గాయం కావడంతో హైదరాబాద్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం అర్ధరాత్రి మృతిచెందారు. మంగ స్వల్ప గాయాలతో చికిత్స పొందారు. వీరికి ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. మరోవైపు శ్రీనివాస్‌రెడ్డి అంతిమయాత్రలో ఎమ్మెల్యే విజయ రమణారావు పాల్గొని పాడె మోశారు. ఎలిగేడు ప్యాక్ ఛైర్మన్ విజయ భాస్కర్‌రెడ్డి, నాయకులు రాజేశ్వర్‌రెడ్డి, సంతోశ్‌రావు, వెంకటేశ్వరరావు, కార్యకర్తలు తదితరులు శ్రీనివాస్‌రెడ్డికి నివాళి అర్పించారు.

నాన్నా.. నీ కల నెరవేర్చా!

న్యూస్‌టుడే, జమ్మికుంట

ఎరువుల దుకాణం నిర్వహించే ఆయనకు రైతుల కష్టసుఖాలు తెలుసు.. అందుకే తన కుమార్తెను బీఎస్సీ (అగ్రికల్చర్) చేయించారు.. నాన్న ఆశయాన్ని అర్థం చేసుకున్న ఆ యువతి కూడా కష్టపడి చదివారు.. ప్రమాదంలో తండ్రి మృతి చెందడం ఆమెను తీవ్ర ఆవేదనలో ముంచినా.. గుండె నిబ్బరం చేసుకున్నారు.. తండ్రి ఆశయ సాధనే తాను ఇచ్చే కానుక అని పోటీ పరీక్షలకు సిద్ధమయ్యారు.. తాజాగా జగిత్యాల జిల్లా ధర్మపురి మండల వ్యవసాయాధికారిణిగా నియమితులయ్యారు.. తన తండ్రి కల నెరవేర్చానని ఆయన ఆశయాలకు అనుగుణంగా రైతులకు సేవలందిస్తానని చెప్పారు.



సింధూజ

ఇల్లందకుంట మండలం సిరిసేడుకు చెందిన గన్ను సింధూజ తండ్రి శ్యాంసుందర్ ఎరువుల దుకాణం నిర్వహించేవారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. తన దుకాణానికి వచ్చే రైతులతో మాట్లాడుతూ వారి సమస్యలు తెలుసుకుంటూ తోచిన సలహాలు ఇచ్చేవారు.. వారి కష్టాలు తీరాలంటే వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు కీలకం అని గుర్తించిన ఆయన తన కుమార్తె సింధూజను వ్యవసాయ విద్య చదవాలని ప్రోత్సహించారు. మొదటి నుంచి చదువులో చురుగ్గా ఉండే ఆమె 2021లో తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి బీఎస్సీ (అగ్రికల్చర్) పూర్తి చేసి ప్రథమ స్థానంలో నిలిచారు. ఓవైపు వ్యవసాయాధికారి కావాలన్న తన తండ్రి ఆశయంపై దృష్టి పెడుతూనే మరోవైపు ఇతర పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేవారు. ఈ క్రమంలో 2022లో కుమార్తెను ఓ పోటీ పరీక్ష రాయించడానికి తీసుకెళ్తున్న శ్యాంసుందర్ ప్రమాదంలో దుర్మరణం చెందారు. కళ్లెదుటే తండ్రి మరణం ఆమెను తీవ్రంగా కుంగదీసింది. తన తండ్రి కల నెరవేర్చడమే ఆయనకు తానిచ్చే కానుక అని నిర్ణయించుకుని వ్యవసాయాధికారి కావడానికి ఆమె సన్నద్ధమయ్యారు. 2023 మే నెలలో 148 వ్యవసాయాధికారుల పోస్టులకు నిర్వహించిన పోటీ పరీక్షకు హాజరై 31వ ర్యాంకు సాధించారు. ఈ ఫలితాలు 2024 జూన్‌లో వెల్లడవగా బుధవారం ధర్మపురి మండల వ్యవసాయాధికారిణిగా విధుల్లో చేరారు.

రూ.లక్షలు వెచ్చించి.. లక్షణంగా వదిలేసి..

రాజుల సొమ్ము రాళ్ల పాలు అన్నట్లుగా మారింది ధాన్యం శుభ్రం చేసే యంత్రాల తీరు. గతేడాది యాసంగి సీజన్ పూర్తయ్యాక గంగాధర వ్యవసాయ మార్కెట్‌కు 40 ధాన్యం శుభ్రం చేసే యంత్రాలు (ప్యాడీ క్లీనర్లు), 8 ఫ్యాన్లు కేటాయించారు. అనంతరం వానాకాలం, యాసంగి సీజన్లలోనూ వీటిని ఉపయోగించలేదు. కేవలం 10 యంత్రాలు మాత్రమే ఆయా గ్రామాలకు పంపించగా, మిగతా 30, 8 ఫ్యాన్లు మార్కెట్ షెడ్డులో వృథాగా పెట్టారు. కేటాయించినా గ్రామాల్లోనూ విద్యుత్తు సదుపాయం లేకపోవడంతో పక్కన పెట్టేశారు. వీటిని వినియోగించకపోవడంతో తుప్పు పట్టిపోతున్నాయి. ఒక్కో దానికి రూ.80 వేల చొప్పున రూ.32 లక్షలకు పైగా ఖర్చు చేశారు. క్షేత్రస్థాయిలో వీటిని వినియోగించే సదుపాయం లేకపోయినా అప్పటి అధికారులు అమ్యామ్యాల కోసం వీటిని కొన్నట్లు ఆరోపణలున్నాయి. కనీసం ఈ వానాకాలం సీజన్‌లోనైనా ఉపయోగంలోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, గంగాధర



ఎల్ఆర్ఎస్‌పై దృష్టి సారించండి

రాష్ట్ర పురపాలక శాఖ సంచాలకులు వీపీ గౌతం



కమాండ్ కంట్రోల్ సెంటర్ పనితీరును పరిశీలిస్తున్న సీడీఎంఏ గౌతం, డిప్యూటీ సెక్రటరీ ప్రియాంక, కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్

కరీంనగర్ కార్పొరేషన్, న్యూస్‌టుడే : ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పురపాలికలు, నగర పాలికల్లో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలని, డిసెంబరులోగా పూర్తి చేయాలని, ఆస్తి పన్ను వసూళ్లపై దృష్టి సారించాలని రాష్ట్ర పురపాలక శాఖ సంచాలకులు వీపీ గౌతం ఆదేశించారు. బుధవారం ఆయన కరీంనగర్ నగరపాలికలోని కమాండ్ కంట్రోల్ సిస్టం, డంపింగ్‌యార్డులోని బయోమైనింగ్, స్మార్ట్‌సిటీ కూడళ్లు, ట్రాఫిక్ సిగ్నళ్లను కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, శిక్షణ కలెక్టర్ అజయ్‌యాదవ్‌తో కలిసి పరిశీలించారు. కమాండ్ కంట్రోల్ పని విధానాన్ని గురించి మున్సిపల్ శాఖ డిప్యూటీ సెక్రటరీ ప్రియాంక వివరించారు. ఉదయం బల్దియా కార్యాలయంలో కరీంనగర్ అధికారులతో, సాయంత్రం ఉమ్మడి జిల్లా పురపాలికల కమిషనర్లు, అధికారులతో వీపీ గౌతమ్ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.

■ వాణిజ్య భవనాలకు తనిఖీ చేసి పన్ను మదింపు సక్రమంగా ఉందో లేదో చూడాలన్నారు.

■ మెప్మా ఆధ్వర్యంలో కొత్త సంఘాలను ఏర్పాటు చేయడంలో అశ్రద్ధ వహించడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. మహిళా శక్తి రుణాలలో నూతన సంఘాలను ప్రోత్సహించాలన్నారు.

■ పారిశుద్ధ్యంపై ఫిర్యాదులు రాకూడదని, పెండింగ్ పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కరీంనగర్‌లో బయోమైనింగ్ పూర్తయ్యే వరకు బిల్లులు చెల్లించకూడదన్నారు. డంపింగ్‌యార్డుకు ప్రత్యామ్నాయంగా స్థల సేకరణ చేయాలని సూచించారు.

జగిత్యాల కమిషనర్ సస్పెన్షన్‌కు ఆదేశాలు

■ఎల్ఆర్ఎస్ ప్రక్రియలో వెనుకబడిన జగిత్యాల మున్సిపల్ కమిషనర్ సమ్మయ్యపై పురపాలక సంచాలకులు వీపీ గౌతం ఆగ్రహించారు. ఎల్ఆర్ఎస్ లాగిన్ ప్రక్రియ చేయకుండా నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడం ఏమిటని మండిపడ్డారు. సస్పెండ్‌కు ఉత్తర్వులు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

■ కుక్కల నియంత్రణ చర్యల్లో జాగ్రత్తగా వ్యవహరించాలని ఆదేశించారు.

■ 15వ ఆర్థిక సంఘం నిధులు వినియోగించుకోవాలన్నారు. వాహనాలకు మరమ్మతులు చేయాలని, అప్పటివరకు కొత్తవి కొనుగోలు చేయకూడదన్నారు. సమావేశంలో పెద్దపల్లి అదనపు కలెక్టరు అరుణశ్రీ, ఆర్‌డీఎంఏ శాహిద్‌మసూద్, ఆర్‌డీడీటీసీపీ మైకేల్, అదనపు కమిషనర్ సువార్త, డిప్యూటీ కమిషనర్ స్వరూపరాణి, సహాయ కమిషనర్ వేణుమాధవ్, తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీలు రాజకీయంగా ఎదగాలి

సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మురళి

సుభాష్‌నగర్(కరీంనగర్), న్యూస్‌టుడే : రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో అన్ని జిల్లాలో పద్మశాలీలు రాజకీయ బరిలో ఉండి, సత్తా చాటాలని రాష్ట్ర పద్మశాలి సంఘం అధ్యక్షుడు కమర్తపు మురళి పిలుపునిచ్చారు. బుధవారం కరీంనగర్ పద్మశాలి ట్రస్టు భవనంలో ఆ సంఘం రాష్ట్ర విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సమావేశానికి జాతీయాధ్యక్షుడు కందగట్ల స్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు మురళి మాట్లాడుతూ.. గడువు పూర్తయిన జిల్లా శాఖలకు ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. కరీంనగర్ మేయర్ పదవి కేటాయించేలా రాజకీయ పార్టీలను కోరాలని తీర్మానం చేశామన్నారు. చేనేత కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తుందన్నారు. మార్చిలో పది వేల మందితో అఖిల భారత పద్మశాలి సంఘం మహాసభను ఏర్పాటు చేస్తామన్నారు. మాజీ రాష్ట్ర అధ్యక్షుడు మచ్చ ప్రభాకర్ సంఘం అభివృద్ధికి ఎనలేని కృషి చేశారన్నారు. మహబూబ్‌నగర్‌లో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర గౌరవాధ్యక్షుడు మెతుకు సత్యం రూ.లక్ష విరాళంగా ప్రకటించడాన్ని అభినందించారు. సమావేశంలో జాతీయ ప్రధాన కార్యదర్శి గడ్డం జగన్నాథం, రాష్ట్ర గౌరవాధ్యక్షుడు మెతుకు సత్యం, రాష్ట్ర రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ వాసాల రమేశ్, ప్రధాన కార్యదర్శి మాచర్ల రాంచంద్రరావు, మున్సిపల్ ఛైర్మన్ రుద్రరాజు, కార్పొరేటర్ చొప్పరి జయశ్రీ, వివిధ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మురళి, పక్కన జాతీయాధ్యక్షుడు స్వామి

వెనక్కి వెళ్లిన నిధులు.. రద్దయిన పనులు

ప్రశ్నార్థకంగా ఆలయాల అభివృద్ధి

న్యూస్‌టుడే, ధర్మపురి

భక్తులకు సౌకర్యాల కల్పనతోపాటు పుణ్యక్షేత్రాలను అభివృద్ధిపరచే లక్ష్యంతో గతంలో ప్రతిపాదించిన పనులు సకాలంలో ప్రారంభించకపోవడం, వివిధ కారణాలతో మొదలుపెట్టినా.. నిలిచిపోవడంతో వాటిని ప్రభుత్వం రద్దు చేస్తూ నిధులను వెనక్కి తీసుకుంది. దీంతో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని ఆలయాల పనులు మళ్లీ ప్రతిపాదించాల్సిన పరిస్థితి నెలకొంది.



ధర్మపురి: నిధులు కేటాయించకపోవడంతో నిలిచిన ధర్మశాల పనులు

ప్రధాన దేవస్థానాల వారీగా..

■ వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి దేవస్థానానికి సంబంధించి రూ.60 కోట్లతో వివిధ కాటేజీల నిర్మాణం, రహదారుల అభివృద్ధి, ఇతరత్రా పనులు నిలిచిపోయాయి.

■ కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానానికి సంబంధించి రూ.100 కోట్లతో రోప్ వే నిర్మాణ తదితర అభివృద్ధి పనులు చేపట్టాలని ప్రతిపాదించగా.. సగం వాటికి సాంకేతిక అనుమతులు వచ్చాయి. ఈ లోపు రద్దయ్యాయి.

ఆదేశాలు రాగానే ప్రతిపాదిస్తాం

ప్రభుత్వం మారడంతో ప్రారంభించిన పనులు కొనసాగుతున్నాయి. ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ప్రభుత్వం ఆదేశాలిస్తే తిరిగి పనులను ప్రతిపాదిస్తాం. వేములవాడ, కొండగట్టు ఆలయాల్లో ప్రతిపాదిత పనులు రద్దయ్యాయి. వీటికి ఇంకా నిధులు కేటాయించలేదు. కేవలం అనుమతులు మాత్రమే వచ్చాయి.

- రఘునందన్, దేవాదాయశాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్

పట్టణంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో వివిధ అభివృద్ధి పనులకు 30.03.2022న నిధులు మంజూరు చేస్తూ గత ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. ఇవన్నీ నూతన ప్రభుత్వం రద్దు చేసింది.

● రూ.5 కోట్లతో చేపట్టిన శ్రీ లక్ష్మీనరసింహస్వామివారి కొత్త కల్యాణ మండప నిర్మాణం

● రూ.1.80 కోట్లతో శ్రీ రామలింగేశ్వరస్వామి వారి 3 అంతస్తుల రాజ గోపురం

ధర్మపురిలో రద్దయిన పనుల వివరాలు..

● చింతామణి చెరువులో రూ.50 లక్షలతో వరాహ విగ్రహ ఏర్పాటు

● రూ.20 లక్షల వ్యయంతో శ్రీ సత్యవతి ఆలయ నిర్మాణం ● రూ.16 లక్షలతో యమ ధర్మరాజు ఆలయ పునర్నిర్మాణం

● నంది కూడలి వద్ద రూ.10 లక్షలతో ఆర్చి గేట్ నిర్మాణం ● రూ.2.20 కోట్లతో 3 రథాలు, రథశాలల నిర్మాణం

● రూ.56.00 లక్షలతో శ్రీ అక్కపల్లి రాజరాజేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి, పునర్నిర్మాణ పనులు

● రాయపట్నం వద్ద రూ.35 లక్షలతో గరుడ విగ్రహ ఏర్పాటు ● రూ.2.30 కోట్లతో బ్రహ్మపుష్కరిణి, శాలహారం నిర్మాణం ● రూ.2.50 కోట్లతో ఉగ్ర నరసింహ ఆలయ పునర్నిర్మాణం ● రూ13 కోట్లతో యోగస్వామి ఆలయ పునర్నిర్మాణం ● రూ.1 కోటి వ్యయంతో మహారాజ గోపురం ● తుమ్మెనాల వద్ద రూ.50 లక్షలతో ఆర్చిగేట్ నిర్మాణం



కోచ్ తిరుపతితో 'ఈనాడు' లక్ష్య క్రీడాకారులు

దక్షిణ భారత అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక

కరీంనగర్ కొత్తపల్లి, న్యూస్‌టుడే: గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఈనెల 17 నుంచి 19 వరకు జరగనున్న దక్షిణ భారత జూనియర్ అథ్లెటిక్స్ పోటీలకు 'ఈనాడు' లక్ష్య క్రీడాకారులు ఎంపికైనట్లు కోచ్ తిరుపతి తెలిపారు. హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ట్రయాథ్లిన్ విభాగంలో జి.నక్షత్ర, బాలికల జావెలిన్ త్రో విభాగంలో సమీరాబేగం, జావెలిన్ త్రో, డిస్కస్ త్రో విభాగంలో స్వామి, 5000 మీటర్ల రేస్‌వాక్ విభాగంలో సాయిచరణ్‌రెడ్డి బంగారు పతకాలు సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరితోపాటు జిల్లా అథ్లెట్లు ఈ.విష్ణువర్ధన్ 10 వేల మీటర్ల రేస్‌వాక్‌లో, ఎం.వినయ్ 3000 మీటర్ల పరుగు పందెంలో బంగారు పతకాలు సాధించి ఈ పోటీల్లో పాల్గొంటున్నట్లు కరీంనగర్ జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మహిపాల్, రవి తెలిపారు. వీరిని కరీంనగర్ యువజన, క్రీడా శాఖ అధికారి శ్రీనివాస్‌గౌడ్, సీనియర్ క్రీడాకారులు హరికిషన్, రవికుమార్ అభినందించారు.